# రాక్షస ముద్ర

పి. సుజాతాదేవి

**ఇంటా బయటా పిల్లల్ని చెడగొట్టడానికి యీనాడు మన సమాజంలో సవాలక్ష సమస్యలు....సుతిమెత్తని బాల్యం మీద ఆ 'రాక్షసముద్ర'లు పడకుండా వాళ్ళని రక్షించుకోవడం ఎలా?**

చలి రాత్రి. వరండా మెట్లెక్కి ఓరగా వున్న కిటికీ సందులోంచి తొంగిచూస్తున్న వెన్నెల. తమకంగా ఉన్న గిరిజా శంకర్‌ల మీద అలవోకగా పరచుకుంది.

మెత్తటి స్వరాన మత్తుగా ఏదేదో చెబుతున్న శంకర్ తలుపు నెమ్మదిగా తెరుచుకోవడంతో చికాగ్గా తల తిప్పాడు. గిరిజ కంగారుగా భుజాల మీదికి పమిట లాక్కుని చటుక్కున మంచం దిగింది.

"మంచినీళ్ళు" కళ్ళు నులుముకుంటూ అంది ఏడేళ్ళ పాప.

"మంచినీళ్ళయితే తాగరాదూ వెళ్ళి" కరుగ్గా అంటున్న తండ్రిని బిత్తరపోయి చూస్తూ వెనక్కు తిరిగింది పాప.

"వాళ్ళకు మంచినీళ్ళు పెట్టాలని తెలీదా?" విసుక్కున్నాడు శంకరం.

"ఏకీ యింకా మన భోజనాలు కూడా కాలేదుగా, కాస్త ముఖం కడుక్కు రండి వడ్డించేస్తా" అంటూ పమిట భుజాలనిండా కప్పుకుని గది బయటికొచ్చింది గిరిజ. అక్కడే నిలబడిన పాప చెయ్యి పట్టుకుని వంట గదిలో కెళ్ళింది

వంటగదిలో టేబులు దగ్గర కూర్చుని ఏదో సినిమా పత్రిక తిరగేస్తున్నాడు సుధాకర్.


"ఎంతసేపయిందిరా వచ్చి? పిలవలేదేం?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

"పిలవలే" అని తలి వేపోసారి చూసి మళ్ళీ పుస్తకంలో తల దూర్చాడు సుధా.

పాపకు మంచినీళ్ళిస్తూ యధాలాపంగా పుస్తకంలోకి చూసింది గిరిజ.

ప్రపంచంలో అన్నింటినీ మించిన ఆనందం "ఆడా - మగ" కలయికలోనే వుందని ఓ ప్రసిద్ధ హిందీ తార ఒళ్ళు విరుచుకు నిలబడి చెబుతోంది.

"లే - లేచి కాళ్ళు కడుక్కు రా" అని, స్టౌ అంటించి చారు వెచ్చబెట్టింది. సుధాకర్ తనను పిలవకుండా అలా కూర్చోడం గిరిజకొక్కించెం బాధగా అనిపించింది. వాడు ఆకలితో అలా కూర్చుంటే తామిద్దరూ.... ఒకసారెప్పుడో శంకర్



తారల ఫొటోలు

శ్రీదేవి.. జయసుధ.. జయప్రద.. జయమాలిని, సుజాత.. మాధవి.. ప్రభ.. కవిత.. పయస్వార్, ఎన్టీఆర్.. శోభన్‌బాబు.. కృష్ణ.. కృష్ణంరాజు, మోహన్‌బాబు.. కమలహాసన్.. చిరంజీవి!

వీరిలో ఎవరి ఫొటో కావాలన్నా ఫొటోకి 3 రూ||లు. ఎం.ఓ. చేయాలి....! ఫొటోతోపాటు సినీతారల అడ్రసులున్న పుస్తకం కూడా పంపబడును!

ఎవరి ఫొటో కావాలో వ్రాయడం మరువకండి!

వై.కె.మూర్తి.
దాసరివారి వీధి * విజయవాడ-2.

పవిత్ర రుద్రాక్ష

1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపు పచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్ఠ మైన రాళ్ళు లభించును. కోరినవారికి ధరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.

Shree Jagdamba Bhawan
(A. J.) SONEPAT-131001.

మీకు బేబి / బాబు కావాలా



స్త్రీ సంజీవి నెం 2 సంతాననిధి

ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతాపత్రములు గలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణా నిపుణులు. ఉచిత వివరములకు:

శ్రీ నాగార్జున మూలిక కుటీరం,
రామాలయంవీధి తెనాలి-2. | 2 వ లైను, కేదారేశ్వరపేట విజయవాడ-3.

చెప్పాడు. తామిద్దరూ గదిలో వుండగా తలుపులు పగలగొట్టవద్దని. అందుకే వాడలా.... పిచ్చిపుస్తకాలు చూస్తూ కూర్చున్నాడు. ఆయనకెన్నోసార్లు చెప్పింది. "అలాంటి పుస్తకాలన్నీ తెస్తే ఆ బొమ్మలూ. అవీ చూస్తూ కూర్చుంటారు, పిల్లల చదువు పాడవుతుందని" అలా ఒప్పుకోరు.

"ఇంట్లో చూడకుండా చేస్తే బైటలేవా? వాటిని దాచిపెట్టీ అందకుండా చేసి. అందులో లేని ఆకర్షణ పెంచడమెందుకు? ఒకసారి బొమ్మలు చూసి అవతల పారేస్తే దాని విషయం మర్చిపోతారు. కాసేపట్లో చదువేం మునిగిపోదు."

అతని మాటలతో పూర్తిగా ఏకీభవించలేకపోయినా వాదించలేక వూరుకుంటుంది గిరిజ.

గిరిజ వడియాలు వేయించి కంచాలు పెడుతుండగా ముఖం తుడుచుకుంటూ వచ్చిన శంకర్ "మనకా గదిలోకి తెచ్చెయ్" అంటూ వెళ్ళిపోయాడు.

గిరిజ సుధకు ఒక్కడికీ ఒడ్డిస్తూ అక్కడే కూర్చుంది.

"గిరీ! అన్నం పెట్టు" శంకర్ కేకలు పెట్టడంతో అన్నం పెట్టుకుని తీసుకెళ్ళింది గిరిజ.

గిరిజా, శంకర్‌లకు తొమ్మిదవ తరగతి చదువుతున్న సుధాకర్, మూడవ తరగతిలో వున్న పాప. మధ్యవాడు రవి ఆరవతరగతిలో వున్నాడు.

శంకర్ నోట్లో ముద్దపెడుతున్న గిరిజ సుధా రావడం చూసి చేయి లాక్కోబోయింది. కాని శంకర్ గట్టిగా కొరకడంతో 'అబ్బా' అని వుండిపోయింది.

"వడియాలు మరిచిపోయావమ్మా." అని వడియాల ప్లేటక్కడపెట్టి వెనక్కు తిరిగాడు సుధాకర్.

"ఏం సినిమా చూశావురా?" అన్నాడు శంకర్.

"ఆడదంటే అలుసా".

అలుసాదుకాఅనిపకపకనవ్వాడుశంకర్.

"ఛీ.... అవేం సినిమాలండీ" అని ముఖం చిట్లించుకుంది గిరిజ సుధాకర్ వెళ్ళిపోయాడు.

అర్ధరాత్రి దాటింది. సుధాకర్ అటు ఇటు పొర్లుతూనే వున్నాడు. సినిమా పత్రికలో ప్రముఖతార వ్రాసిన నలభై సూత్రాలు వాడికి కంఠతా వచ్చేశాయ్. సినిమాలో భయంకరంగా అమ్మాయి కేకలు. ఎందుకంత భయం? ఏమవుతుంది? క్రూరంగా నవ్వుతూ వంటిమీద బట్టల్లాగుతూ ఏమిటా ఆనందం? అమ్మా-నాన్న నిద్రపోయారా? అనే అనుమానం వచ్చింది.

చటుక్కున మంచం మీదనుంచి రెండడుగులు వేసినవాడు మళ్ళా వెనక్కొచ్చి పడుకుండిపోయాడు.

* * *

సంక్రాంతి దగ్గరపడుతోంది. చలిలోనే ఓపిగ్గా ముగ్గు వేస్తోంది లక్ష్మి. ముగ్గు వేశాక, పసుపూ పూలూ వేయడానికి హేమ ఎదురు చూస్తోంది.

పిల్లల కేకలకు ఉలికిపాటుగా లేచాడు రాధాకృష్ణ. 'నేనంటే నేనని' వాదులాడుకుంటున్నారు సుధీర్, హేమ

"ఏమిటి? ఏమిట్రా అదీ. పొద్దున్నే గోల...." కొంచెం విసుగ్గా అన్నాడు రాధాకృష్ణ.

"రోజూ తనే ముగ్గుల్లో వెయ్యాలిట పువ్వులు. ఇవాళ నేనేస్తానంటే యివ్వడం లేదు" ఉక్రోషంగా అక్కవైపు చూస్తూ అన్నాడు బాబు. పాప బంతిపూల రేకలు పోసిన పళ్ళెం చేత్తో పట్టుకునినిలబడింది.

"వాడిప్పుడే లేచాడు నాన్నగారూ! పాచి ముఖంతో ముగ్గుల్లో పూలువెయ్యకూడదు" అంటోంది

"సరి నీకూ్కడా అంటించిందీ మీ అమ్మ. ఏంఫరవాలేదు గాని- ఇవాళ బాబును వెయ్యనీయమ్మా" అన్నాడు రాధాకృష్ణ. హేమ అయిష్టంగా చూస్తుండగానే లక్ష్మి వచ్చింది.

"మీకు మరీను. వాడికెందుకండీ అవన్నీ- ఆడపిల్లల సరదాలు."

"పిల్లలంటే పిల్లలు, సరదాలు వాళ్ళకుండకపోతే మనకుంటాయా?"

"మనం చెప్పకుండా వాళ్ళకు మంచీ.... చెడూ ఎలా తెలుస్తాయండీ" ముఖం చిట్లిస్తూ అంది లక్ష్మి.

"అవే తెలుస్తాయి. చిన్నప్పుడు నేనూ మా అక్కతో అచ్చనగాయలాడేవాణ్ణి. గొబ్బెమ్మలు పెట్టేవాణ్ని. ఇప్పుడు చెయ్యమంటే చేస్తానా?"

"సర్లే-పొద్దున్నే మీతో వాదనేంటి? అవతల బోలెడు పని బెట్టుకుని...." విసవిసా వెళ్ళిపోయింది లక్ష్మి.

తల్లి పెట్టిన విష్ణుచక్రం ముగ్గులో పసుపూ, పూలూ వేసి వచ్చింది హేమ.

రాధాకృష్ణ స్నానం చేసి వచ్చేసరికి అందరికీ టిఫిన్ సిద్ధంచేసింది లక్ష్మి.

"ఇవాళ సినిమాకెళ్దాం నాన్నగారూ...." అంది హేమ. ఇవాళ సాయంత్రం పార్టీ వుందమ్మా రేపాదివారమేకదా! వెళ్దాంలే" అన్నాడు రాధాకృష్ణ.

"వాళ్ళు సీతారామకల్యాణం మాస్‌షోకి వెళ్దామంటున్నారు" అంది లక్ష్మి.

"వాళ్ళను వెళ్ళనీ" అన్నాడు రాధాకృష్ణ.

"వాళ్ళొక్కళ్ళూ వెళ్ళడమెందుకు? ఇవాళ మీకాఫీసు లేదుగా" అంది లక్ష్మి.

"నాకొంచెం పని వుంది."

"అయితే నేను తీసికెళ్తాలే" అంది లక్ష్మి.

రాధాకృష్ణ ఏదో అనబోతుంటే.

"మీరనేదేమిటో నాకు తెలుసుగానీ, ముందు టిఫిన్ చెయ్యండి. ఖచ్చితంగా పదకొండు గంటలకే షో బిగిన్' అంది లక్ష్మి నవ్వుతూ.

"సాయంత్రం బెనర్జీగారింట్లో హౌస్ వార్మింగ్ పార్టీవుంది లక్ష్మి. మనిద్దరం వెళ్దాం" అన్నాడు రాధాకృష్ణ మాట మారుస్తూ.

అప్పుడేవచ్చి కుర్చీ లాక్కుని కూర్చున్నారు రామారావుగారు.

"ఇవాళింతాలస్యంగా లేచా వేంనాన్నా?" అడిగాడు రాధాకృష్ణ.

"రాత్రి ఆయాసం మరీ యెక్కువగా వుంటే మూడు నిద్రమాత్ర లేసుకున్నా. పొద్దున మరీ మగతగా వుంటే పడుకునే వుండిపోయా" అన్నాడాయన.

"అట్లా అలవాటు చేసుకోకండి. అదంత మంచిది కాదు" అంది లక్ష్మి.

ఏవో కబుర్లు చెప్పుకుంటూ ఫలహారం చేశారు.

* * *

సాయంత్రం నాలుగైంది.

సెలవు రోజని హేమని తీరిగ్గా ముస్తాబు చేసింది లక్ష్మి

"సినిమా ఎలా వుంది హేమా?" అనడిగాడు రాధాకృష్ణ.

"చాలా బావుంది నాన్నగారూ" అంది హేమ

"రావణబ్రహ్మ అంత లావుండీ.... శివధనస్సు ఎత్తలేక వెల్లకిలా పడతాడు నాన్నగారూ అప్పుడు రాముడు ధనస్సుని ఎత్తి విరిచేస్తాడు" హుషారుగా చెప్పాడు బాబు

"అదెప్పటిదో పాత విల్లుకదా. రాము డెత్తేసరికి పుటుక్కున విరిగిపోయి వుంటుంది" అన్నాడు రాధాకృష్ణ.

"చాల్లే ఊరుకోండి" కసిరింది లక్ష్మి.

"అమ్మా పాపం ఆ వేదవతి అలా కాలిపోయిందేమిటే?" అంది హేమ.

"అవునమ్మా. రావణాసురుడు దురుద్దేశంతో తనను తాకాడుగదమ్మా. అందుకని ఆమె ప్రాణత్యాగం చేసింది."

"అప్పను-పోయిన్నెల మనం చూసిన సినిమాలోకూడా అంతేకదూ నాన్నగారూ. ఆ అమ్మాయి ఉరేసుకు చచ్చిపోతుంది. కాని రావణాసురుడు కొంచెం మంచివాడను

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
1982 నవలల పోటీ
ముగింపు తేదీ : 30, ఏప్రిల్
ఫలితాల ప్రకటన : 22, జూన్
మొదటి బహుమతి : రు. 4000
రెండవ బహుమతి : రు. 3000
మూడవ బహుమతి : రు. 2000
వివరాలకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్ :: విజయవాడ-520004.

పళ్ల డాక్టరు చెబుతున్నారు
పళ్లు, చిగుళ్ల సక్రమ సంరక్షణకోసం
పళ్లను బ్రష్ చేసుకోవడం ఎంత ముఖ్యమో,
చిగుళ్లను మాలిష్ చేసుకోవడం కూడా అంతే ముఖ్యం
ఫోర్‌హేన్స్ డబుల్ యాక్షన్
టూత్‌బ్రష్ వాడండి
మీ పళ్లను శుభ్రపరచడంతోపాటు చిగుళ్లను మాలిష్ కూడా చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది



మృదువైన తెల్లని కుచ్చులు మీ చిగుళ్లను మాలిష్ చేస్తాయి
దృఢమైన నీలిరంగు కుచ్చులు మీ పళ్లను శుభ్రపరుస్తాయి

ఫోర్‌హేన్స్
టూత్ బ్రష్
ఇంటిల్లి పాది కోసం
అడల్ట్ (మీడియం మరియు సాఫ్ట్), జూనియర్, బే.
Regd. T.M: Geoffrey Manners & Co. Ltd.
256 F-122 TEL

కుంటా.... ఆ సినిమాలో విలన్లా వెంటబడి పట్టుకోలేదు" అన్నాడు బాబు.

"అందుకే వచ్చిన ప్రతి వెధవ సినిమాకూ పిల్లల్ని తీసికెళ్ళ కూడదనేది" భర్త వంక ఉరిమిచూస్తూ అంది లక్ష్మి.

"ఆ రాక్షసుడు తల వెంట్రుక తాకితేనే ఆవిడ చచ్చిపోయింది" ఇంకా ఆ విషయమే ఆలోచిస్తున్నట్లు ఎటో చూస్తూ అంది హేమ.

"అవునమ్మా. చెడు తలపుతో పరాయివాడు వెంట్రుక తాకినా తను అపవిత్రమైపోయినట్లే అనుకుందావిడ"

తన్మయంగా చెప్పుకుపోతున్న లక్ష్మిని రాధాకృష్ణ "ఇంక చాల్లే ఆపు" అనడంతో ఆగిపోయింది.

ఎప్పుడూ ఈ విషయంలో ఇద్దరికీ వాదమే.

"పిల్లలకు కాస్త సొంతంగా ఆలోచించడం నేర్పాలోయ్ నీ నమ్మకాలూ, భావస్తాలూ వాళ్ళనెత్తిన రుద్దకు" అంటాడు రాధాకృష్ణ

"వాళ్ళదేముందీ, మైనపు ముద్దల్లాంటి వాళ్ళు. ఈ వయసులోనే వాళ్ళను సరైన తీరులో మలచాలి. అలా గాలికి వదిలేసే నానాటికీ వెర్రి తలలేస్తున్న నాగరికతా ప్రపంచంలో వెనక్కో, ముందుకో తెలీని వేగంతో మారుతున్న వ్యవస్థలో, ఎటు కొట్టుకుపోతారో చెప్పలేం. కనుక మనం మన జీవితాన్ని ఒక వంతు మన స్వంతానికి, మూడొంతులు వాళ్ళకోసం జీవించాలి" అంటుంది లక్ష్మి.

"అప్పుడు వాళ్ళు మనుషులుగా కాక నీ నీడలుగా తయారౌతారు. మారుతున్న కాలంలో మంచి చెడుల విలువలుకూడా తారుమారౌతున్నై. వాటి విలువలను వాళ్ళ అనుభవాలతో తెలుసుకోనీ" అంటాడు రాధాకృష్ణ.

ఈ వివాదం ఏ చిన్న విషయం దగ్గరైనా వచ్చి ఎంతదూరమైనా వెళుంది. మధ్య మధ్య రామారావుగారు కూడా కల్పించుకుని తన పిల్లలు పెరిగినప్పటికీ ఇప్పటికీ స్థూలంగావచ్చినమార్పులుఅంటే విద్యావిధానంలోనూ, గురు శిష్యసంబంధాల్లోనూ, పిల్లల వైఖరిలోనూ వచ్చిన మార్పులు చెబుతారు. ఆ మార్పులు మూలంగా తీసుకుంటే వాటి ననుసరించి వచ్చిన అనేకానేక పరిణామాలను గురించి రాధాకృష్ణ వివరిసాడు

"అమ్మో.... ఈ పద్మవ్యూహంలో కెళ్ళి నెగ్గుకొచ్చే శక్తి నా పిల్లలకెలా ఇవ్వగలను. ఇంకేం చెయ్యాలి?' అని ఆలోచనలో పడుతుంది లక్ష్మి.

లక్ష్మి ఆలోచిస్తూనే మామగారితోపాటే పిల్లలకూ కూడా రొట్టెలు తయారుచేసి పార్టీకి తయారైంది. రాధాకృష్ణ పిల్లలకేదో ఇంగ్లీషు కథ చదివి చెబుతున్నాడు.

అంతలో గిరిజా, శంకర్ చిన్నపిల్లలిద్దర్నీ తీసుకునివచ్చారు. వీళ్ళు పార్టీకెళ్తున్నట్లు తెలిసి కూర్చోకుండానే వెళ్ళిపోయారు. ఉపనిషద్వాణి ఉపన్యాసాలేవో వున్నాయని రామారావుగారూ వెళ్ళారు.

తాతయ్య వచ్చేంతవరకూ తలుపులేసుకుని జాగ్రత్తగా వుండమని పదే పదే పిల్లలకు చెప్పి బయల్దేరింది లక్ష్మి.

"నువ్వు మరీ పాతివ్రత్యం గురించి, ప్రాణ త్యాగాల గురించీ దాన్ని ఊదరగొట్టి చంపుతున్నావు" దారిలో అన్నాడు రాధాకృష్ణ.

"మన పురాణాలు, సంప్రదాయాలు పిల్లలకు చెప్పుకోకపోతే ఎలా? అదేం తప్పు కాదు!"

"రేపు అది కో-ఎడ్యుకేషన్ కెళ్తుంది. ఏ కుర్రాడన్నా చేయిపట్టుకుని "ఐ లవ్ యూ" అన్నాడే అనుకో, అంత మాత్రానికే ఏదో ఉపద్రవం జరిగిందని...."

"ఛీ!....ఏం మాటలండీ అవి....మీకలాంటి అనుమానముంటే అసలు దాన్ని కో ఎడ్యుకేషన్లో చదివించొద్దు" కోపంగా అంది లక్ష్మి.

"పిచ్చి లక్ష్మీ! అసలు కాలేజీ చదువే వద్దన్నావు కాదు. దానికిప్పుడు పదకొండేళ్ళు. వాళ్ళని ఎదగనీ. వాళ్ళ ఆలోచన్లొక పరిధిలో బిగించాలని ఎందుకు చూస్తావు? రానురాను వాళ్ళు నీతో గడిపే సమయంకన్నా బైటగడిపే సమయమే ఎక్కువౌతుంది. బైట కనబడే ఆకర్షణకూ, వేగానికీ మనం పోటీగా నిలబడలేం."

"అంటే ఆ ప్రభావంతో వాళ్ళేంచేసినా మనం చూస్తూ వుండాల్సిందేనా?"

"అనుభవాలే పాఠాలు లక్ష్మీ. మనం చెప్పే మాటలకన్నా మన నడవడిక వాళ్ళనొక సేజీలో ఆలోచింపజేస్తుంది."

"ఏమిటో! మీ ఫిలాసఫీ నాకర్థం కాదు" అని తల వంచుకుని ఏదో ఆలోచిస్తూ నడుస్తున్న లక్ష్మిని చూసి జాలిపడ్డాడు రాధాకృష్ణ.

ఇప్పుడు హేమకు పదకొండేళ్ళు. బాబుకు తొమ్మిది. కాని పదకొండు నెలల అప్పటినుంచే లక్ష్మితాపత్రయం మొదలు. లక్ష్మి డిటెక్టివ్ నవల్స్ విపరీతంగా చదివేది. ఒకరోజు పాపను చదవొద్దని రెండు మూడుసార్లు కేకలేయడం విన్న రాధాకృష్ణ.

"అవి చదవకూడదు. చెడ్డ పుస్తకాలు అంటే నువ్వెందుకు చదువుతున్నావు?' అనే ప్రశ్న ఈవేళ కాకపోతే రేపైనా వస్తుంది. వాళ్ళను వద్దని నువ్వు మాత్రమే చదువుతుంటే అందులో ఏముంది? అనే ఆకర్షణ సహజంగా వుంటుంది."అన్నాడు.

అంతే. మళ్ళీ ఆ పుస్తకాల ముఖం చూడలేదు లక్ష్మి. ఇదొక ఉదాహరణ మాత్రమే

పిల్లలు పెరుగుతున్న కొలదీ.... తన అలవాట్లలో, సాంసారిక జీవితంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది లక్ష్మి. మరీ మూర్ఖంగా అనిపించినపుడు మాత్రం నచ్చచెబుతాడు రాధాకృష్ణ



వాళ్ళు ఇంటికి తిరిగొచ్చేసరికి పద కొండయింది. రామారావుగారు తలుపు తీశారు.

"పిల్లలు భోంచేశారా?" అనడిగింది లక్ష్మి.

"ఆ.... హేమ నేత్రాకముందే పడు కొంది. బాబు మీ కోసం రెండుమూడు సార్లడిగి ఆ కుర్చీలోనే నిద్రపోతుంటే ఇలా పడుకోబెట్టాను" అన్నారు రామా రావుగారు.

బాబుని బుజంమీద వేసుకొని గదిలోకి తీసుకెళ్ళింది. హేమ గాఢంగా నిద్ర పోతోంది. బాబును పడుకోబెట్టి ఓ క్షణం ఇద్దరివంకా మురిపెంగా చూసి తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది.

చాలాసేపటి వరకూ బెనర్జీగారి కుటుంబం గురించీ, కొత్త యింటి గురించీ పార్టీకొచ్చిన స్నేహితుల గురించీ మాట్లాడుకున్నారు. వున్నట్టుండి ఏదో ఆలోచనలోపడ్డ లక్ష్మి భుజం తడుతూ.... "ఏమిటి నిద్రొస్తోందా అప్పుడే?" చిలి పిగా అడిగాడు రాధాకృష్ణ.

"అహ ....లేదులే...." అని అతనివేపు తిరిగి.

"ఏమండీ .... హేమ అత్తవారింటికెళ్తే ఎట్లాగండీ మనముండేది" అంది లక్ష్మి.

"అబ్బబ్బా ఏమిటి లక్ష్మి. పాప రేపే వెళ్తున్నట్టు- ఇంతకూ సంక్రాంతికి మనం మా తమ్ముడింటికి వెళ్దామా? వాళ్ళనే రమ్మని రాద్దామా?"

లక్ష్మి సంభాషణ పిల్లల మీదికొచ్చి నపుడల్లా మాట మార్చి మరొకటి చెబు తుంటాడు రాధాకృష్ణ.

రాధాకృష్ణ పిల్లలంటే ప్రేమగానూ, బాధ్యతగానూ వుంటాడు. కాని అతని కన్నా విసుగు పుట్టేంత ఎక్కువ మాట్లాడుతుంది లక్ష్మి.

"వాళ్ళనే రమ్మందాం వాళ్ళైతే చంటా డ్నొకర్నీ తీసుకొచ్చేస్తారు. మనమూ పిల్లలూ, మామగారూ, ఆయన మందులు"

"అవునవును నువ్వూ, ముగ్గుగొట్టం" ఎగతాళిగా అన్నాడు రాధాకృష్ణ

మామగారు పిలుస్తున్నారని దిగ్గున లేచి వెళ్ళి తలుపు తీసింది లక్ష్మి.

ఈ వేళప్పుడెందుకు పిలిచాడా అని రాధా కృష్ణ లేచి వచ్చాడు.

"నా నిద్ర మాత్రల సీసా కనిపించడం లేదమ్మా! ఎంత సేపటికీ నిద్ర రావడం లేదు. ఆయాసమెక్కువౌతోంది."

"ఏమౌతుంది. నే చూస్తానుండండి" అని ఆయన సొరుగులన్నీ చూసింది.

"పిల్లలగదిలో చూడు" అన్నాడు రాధాకృష్ణ.




"పిల్లల గదిలో యెందుకుంటుందీ?" అంటూనే వెళ్ళారిద్దరూ.

"హేమ అలా పడుకుందేమిటి?" అని దగ్గరకెళ్ళి సరిగా పడుకోబెట్టాడు రాధా కృష్ణ.

హేమ ముఖం అదోలా వుంది. శ్వాస పీల్చుకోడంకూడా స్వాభావికంగా లేదు. ఒక్కక్షణం ఏదో ఆలోచనతో నిలువెల్లా కంపించిపోయాడు రాధాకృష్ణ.

ఒక్క క్షణం ఏదో ఆలోచించి గది నాలుగు మూలలా చూసి పరుపు పైకెత్తి చూశాడు. ఖాళీ నిద్ర మాత్రల సీసా.

"హేమా.... హేమా!"

"ఏమిటండీ అంత కంగారు?" అంది డ్రాయరు తీసి చూస్తున్న లక్ష్మి.

"లక్ష్మి, హేమను హాస్పిటల్‌కు తీసు కెళ్ళాలి రా...." అంటూ అవతలి గది లోకి పరుగెత్తాడు రాధాకృష్ణ.

హాస్పిటల్ బెంచీమీద లక్ష్మి అచేత నంగా కూర్చుండిపోయింది. పాపను డాక్టర్లు కప్పజెప్పి బాబువల్ల జరిగింది తెలుసుకున్నాడు రాధాకృష్ణ.

* * *

వాళ్ళు వెళ్ళిన కాసేపటికే సుధాకర్ వచ్చాడు. వాళ్ళమ్మా వాళ్ళు వున్నారా అని. అప్పటికే రామారావుగారు కూడా వెళ్ళిపోయారు. ముగ్గురూ కాసేపు క్యారమ్స్ ఆడుకున్నారు. బాబుకు డబ్బు లిచ్చి దూరంగా వున్న బేకరీలో మూడు కేకులు తెమ్మని పంపించాడు.

బాబు తిరిగి వచ్చేసరికి హేమ అరు పులు వినిపిస్తున్నాయి. "తలుపులు కొడితే తియ్యలేదు. పాలమనిషి డబ్బులకోసం వచ్చింది. అప్పుడే తలుపు తీసి పరుగెత్తి వెళ్ళిపోయాడు." లక్ష్మి రూపం చూసి బాబు నెక్కువగా మాట్లాడ నివ్వలేదు రాధాకృష్ణ.

"మీరు పోలీసు రిపోర్టివ్వండి ముందు. వేలెడులేడు వాడికిలాంటి బుద్ధులా" అని ఆవేశపడిపోయి "ఇంతకూ.... ఇంతకూ హేమ.... హేమ" అని బావురుమంది లక్ష్మి. రాధాకృష్ణ ఆలోచనలోపడ్డాడు అతని కళ్ళు సుధాకర్‌ను దాటి ఇంకా దూరంగా చూస్తున్నాయి. సుధాకర్‌నుకాక ఇంకా ఎదిగీ ఎదగని వేలాది పసివాళ్ళను చూస్తు న్నాయి. వాళ్ళ మనసులమీద రాక్షస ముద్రలు పడడానికి కారణాలు వెతుకు తున్నై. ఎలా పెంచాలి? ఎలా రక్షించాలి? ఏమని బోధించాలి? ఆ మూడు ప్రశ్నలూ హేమ ఆరోగ్యంకన్నా ఎక్కువ వేధిస్తు న్నాయి

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేచనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!